కథ

# నరకంలో నిత్యానందం

పరిమళా కిశోరి

''చేతిలో ఆ వస్తువేంటి?!'' కోపంగా అడిగాడు యమధర్మ రాజు.

''పర్సనల్ క్యాసెట్ ప్లేయర్'' ధైర్యంగా బదులిచ్చాడు నిత్యానందం.

''ఇక్కడికి ఉత్త చేతుల్తోనే రావాలి! అంతేగాని భూలోకం లోంచి ఇలా అడ్డమైన వస్తువుల్నీ తీస్కురాకూడదు. వాడికి బుద్ధిలేదు సరే. మీ జ్ఞానం ఏమైందిరా?!'' కింకరుల వైపు కోపంగా చూస్తూ అడిగాడు యమధర్మరాజు.

''సర్లే సర్లే'' అనేసి మళ్ళీ నిత్యానందం వైపు తిరిగాడు యమధర్మరాజు.

''ఇంతకీ నువ్ దాన్నెందుకు తెచ్చుకున్నట్టు?!'' అడిగా డతన్ని.


''సినిమా పాటలు వింటానికేం కాదులెండి. ఇందులో మా ఆవిడ మాటలున్న ఓ క్యాసెట్టుంది..''

''ఉంటే?!''

''ఏం లేదుసార్! నాకు నా భార్యంటే వల్ల మాలిన ఇష్టం. అప్పుడప్పుడూ తన మాటలు వింటుండొచ్చు కదాని దీన్ని తీస్కొచ్చుకున్నానంతే. మీరు కాస్త పెద్దమనసు చేస్కుని దీన్ని నాతోపాటు ఉంచుకోడా నికి పర్మిషనివ్వాలి'' అన్నాడు నిత్యానందం మస్కాగొడుతూ.

''మిస్టర్ గుప్తా! ఏం చేద్దాం?'' పక్కనే ఉన్న చిత్రగుప్తుణ్ణి సలహా అడిగాడు యమధర్మరాజు.

''భార్యను అంతిదిగా ప్రేమించే భర్తలు ఈ కాలంలో చాలా అరుదు సార్! పోనీ ఉంచుకోనివ్వండి. అప్పుడప్పుడు ఆవిడగారి మాటలు వింటుంటాడంతేగా?'' అనేశాడు చిత్ర గుప్తుడు.




''మీరిద్దరూ చాలా మంచివాళ్ళు సార్! కాదు కాదు. రూపమెత్తిన మంచితనాలు'' అన్నాడు నిత్యానందం వాళ్ళకు మరింత మస్కాకొడుతూ.

ఆ మాటలకే ముసిముసిగా నవ్వి, ఆ మీదట చిత్రగు ప్తుణ్ణి అడిగాడు యమధర్మరాజు.

''ఇంతకీ నువ్ చిట్టా విప్పనే లేదు. వీడు పాపినా, పుణ్యా త్ముడా. వీణ్ణి మన నరకంలో ఉంచుకోవాలో లేక స్వర్గానికి పంపించెయ్యాలా?!''

''స్వర్గంలో వాడికి నోఎంట్రీ ప్రభూ! అన్నీ పాపాలు చేశాడు వెధవ! సో..వాడికి నిత్యనరకమే'' అంటూ దొంతరలోంచి ఓ చిట్టా పుస్తకం బైటకు లాగి ''పాపాల లిస్టు చదవమంటారా?'' అనడిగాడు చిత్రగుప్తుడు.

''అక్కర్లేదులే. వాడి ఫేస్ చూస్తుంటేనే తెల్సిపోతా ఉంది ఉత్త పాపిష్టి వెధవని..'' అంటూ క్లర్క్‌ని వారించి- ''ఊ..నర కంలోకి తీస్కెళ్ళండి'' అంటూ తన భటులకాజ్ఞాపించాడు యమధర్మరాజు.

★★★

''వీడికి వెయ్యి కొరడా దెబ్బలు వడ్డించండి''

నరకంలో కొరడా దెబ్బల సెక్షన్ హెడ్డు ఉత్తర్వులు జారీ చేశాడు తన భటులకి.

ఉత్తరక్షణం నిత్యానందానికి ఆ శిక్ష విధించబడింది.

తన ఒంటిమీద ఒకేసారి అయిదారు కొరడాలు నాట్యం చేస్తున్నప్పటికీ నిత్యానందానికి చీమకుట్టినట్టుగా కూడా అని పించలేదు.

అందుక్కారణం...

అతను వెంట తెచ్చుకున్న పర్సనల్ క్యాసెట్ ప్లేయర్ లోంచి చెవిలో మోగుతున్న భార్య సాధింపు.

''హు..ఏం మనిషండీ మీరు? మీకన్నా దున్నపోతు నయం!..నా ఖర్మకొద్దీ మీ పాలబడ్డాను! మన పక్కింటి శేషా ద్రిని చూడండి. చేసేది మీలాంటి ఉద్యోగమే అయినా తన తెలివి తేటల్తో ఎంత సంపాదిస్తున్నాడో..మనిషంటే అలా ఉండాలి. హు. మీరూ ఉన్నారు దేనికీ..'' లాంటి కఠినోక్తు లతో భార్య స్వరం చెవుల్లో మోగుతుంటే కొరడాదెబ్బలేం చేస్తాయ్ ఏ మగాణ్ణైనా?!

కొరడా దెబ్బల శిక్షయ్యాక-

ఏనుగులతో తొక్కించే సెక్షన్‌కెళ్ళాక... అక్కడా అంతే!

అయిదారేనుగులు తన మీదెక్కి తొక్కుతున్నా కూడా దోమ వాలినంత బాధైనా కలగలేదు నిత్యానందానికి.

ఏనుగులతో తొక్కించుకోవటం భార్య సాధింపుకన్నా బాధాకరమేం కాదు కదా?!

అదయ్యాక...నూనెలో వేపే సెక్షన్‌కి తీస్కెళ్ళారు నిత్యానం దాన్ని.

అక్కడ పరిస్థితి డిటోనే! పర్సనల్ క్యాసెట్ ప్లేయర్‌లో భార్య సాధింపుని ఆలకిస్తూ ఎంతో హ్యాపీగా ఆ శిక్షను అనుభ వించేశాడు నిత్యానందం.

★★★

అలా కొన్నేళ్ళు గడిచాక..

నిత్యానందం పేరు 'నరక గిన్నీస్ బుక్' లో నమోదైంది.

నిత్యనరక శిక్షననుభవిస్తూ కూడా నిత్యం హ్యాపీగానే ఉండగలుగుతున్న ఏకైక వ్యక్తిగా!

★